మలుపులో పొంచి ఉన్న ప్రమాదం

- శామీర్‌పేట బైపాస్‌లో రోడ్డు పక్కనే గుంతలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



శామీర్‌పేట శివారులో సిద్దిపేట-బాణాపురం బైపాస్ రోడ్డు



జంక్షన్‌లో ప్రమాదకరంగా ఉన్న మలుపు

జనగామ: జనగామ–సిద్దిపేట ప్రధాన రహదారి శామీర్‌పేట శివారు బైపాస్ మలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. శామీర్‌పేట నుంచి బాణాపురం వరకు బైపాస్ నిర్మాణంతో రెండు వైపులా వెళ్లే రోడ్డును కలుపుతూ జంక్షన్‌గా ఏర్పాటు చేశారు. రోడ్డు నిర్మాణంలో ఎత్తు పెరగడంతో రెండు వైపులా పెద్ద గుంతలు వాహనచోదకుల పాలిట ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయక పోవడంతో వాహనాలు గుంతల్లో పల్టీలుకొడుతున్నాయి. స్ట్రెయిట్ రూట్‌గా భావించి డ్రైవర్లు అలాగే రావడం, మలుపు కనిపించడంతో సడెన్ బ్రేకులు వేయడం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రూట్ ఐదు రాష్ట్రాలకు ప్రధాన రహదారి కావడంతో 24 గంటల పాటు వందలాది వాహనాలు వచ్చి పోతుంటాయి. ఇటీవల ఏపీ రాష్ట్రం ఏలూరు జిల్లాకు చెందిన కూలీలతో వెళ్తున్న బొలేరో వాహనం గుంతలో పడడంతో 19 మందికి తీవ్ర గాయాలు కాగా, చాలామంది ఇంకా ఆస్పత్రిలోనే ఉన్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా సంబంధిత అధికారులు స్పందించక పోవడం గమనార్హం. మరో సారి ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రైల్వే గేట్ క్లోజ్.. రాకపోకలకు ఇబ్బంది



మూసివేసిన నిడిగొండ రైల్వే గేట్

రఘునాథపల్లి: మరమ్మతులో భాగంగా నిడిగొండ రైల్వే గేట్ మూసి వేయడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు నుంచి పది కిలోమీటర్లు అదనంగా తిరగాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నుంచి గేట్ మూసి వేస్తున్నట్లు ప్రకటించిన రైల్వేశాఖ ఎప్పటి వరకు క్లోజ్ చేస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్ని రోజుల వరకు మూసి వేస్తారన్న దానిపై స్పష్టత లేక పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మాధారం, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్, తదితర ప్రజలు జిల్లా కేంద్రంకు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తారు. గేట్ మూసి వేసిన నేపథ్యంలో లక్ష్మీతండా మీదుగా ఇబ్రహీంపూర్, మాదారం వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్ నుంచి 10 కి.మీలు ఉండే జనగామకు , ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్తే 15 కి.మీలు ఉంటుంది. దీంతో సమయం, ఇందనం, వృధా అవుతుందని పౌరులు పేర్కొంటున్నారు. ఆటోల్లో వెళ్లే వారికి చార్జీల భారం పెరుగుతోంది. ఈ గేట్ వద్ద ఏడాదిగా ఆర్‌యూబీ పనులు మందకొడిగా సాగుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైల్వే గేట్ తెరవడంతో పాటు, ఆర్‌యూబీ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం



పాలకుర్తి టౌన్: తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు పన్నీరు నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా 1997–1998 పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20 సాయం అందజేశారు. స్నేహితులు ఇండ్ల సునీత, ముత్తోజు రాజు, సలేంద్ర సోమన్న, బెల్లి యుగేందర్, కమ్మగాని మధు, అశోక్,కుమార్, ఆవిరినేని పోతనరావు, పెద్దురి ఎలేందర్, ఎండీ మాషుక్, యాకుబ్‌నాయక్, నాయిని కరుణాకర్, రమేష్ ఉన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో చందనోత్సవం



జనగామ: పట్టణంలోని సాయినగర్ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం చందనోత్సవం నిర్వహించారు. పూజారి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో భక్తులు శ్యాంసుందర్‌రెడ్డి, కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి, పంట, కుటుంబాలు చల్లంగా ఉండేలా దీవించాలని వేడుకున్నారు. రోజువారీ పూజలతో పాటు ప్రతివారం చందనోత్సవం నిర్వహించనున్నట్లు పూజారి తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

జనగామ రూరల్: పెంబర్తిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలోని ఏడుగురు విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపి ర్యాంకులు సాధించినట్టు ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ. తిరుమల కామర్స్ సబ్జెక్టులో మొదటి ర్యాంకు, జె.నందిని మూడో ర్యాంకు, అలాగే ఎస్. రష్మిత సీటు సాధించినట్లు తెలిపారు. తెలుగు సబ్జెక్టులో ఎస్. రవళి, పి.శివలీల ఎంపికకాగా కెమిస్ట్రీలో కె. సంధ్యారాణి, బీపీడీలో ఎ.అఖిల యూనివర్సిటీలో సీట్లు సాధించారన్నారు. రమ్య, శ్రావణి సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులతోపాటు అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం



రఘునాథపల్లి: పల్లెల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మసాన్‌పల్లి లింగాజీ, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం నిడిగొండ ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంజూరి చేసిన సీసీ రోడ్డు పనులను వారు పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఎండీ అబ్బాస్‌మియా, జక్కుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిట్ల ప్రదర్శన



కొడకండ్ల: తెలుగు భాషా ఔన్నత్యాన్ని, మహత్యాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారని హెచ్‌ఎం నారగోయిన యాకయ్య అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏడునూతుల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు ఎం.రజిత ఆధ్వర్యంలో విద్యార్థులు సృజనాత్మకంగా, విభిన్న రకాల టీఎల్‌ఎంలను తయారు చేసి ప్రదర్శించారు. కమల్‌కుమార్, రాంబాబు, ఈర్య, మమత, సోమేవ్వర్, యాదగిరి, విజయ, కవిత, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతిభాపాటవ పోటీలు

దేవరుప్పుల: మాదాపురం పాఠశాలలో తెలంగాణ ప్రాంతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌ఎం నల్ల లలిత ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి తెలంగాణ సాంప్రదాయ గేయాలతో వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు నర్సయ్య, సుజిత్, జీవన్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్–కళ్లెం కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జీడికల్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాల్లో భాగంగా సిరిపురంలో జెండాను ఆవిష్కరించి పాదయాత్ర మొదలు పెట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కరుణాకర్ మాటాడారు. దేవదానం, శంకరయ్య, ఉప్పలయ్య, లక్ష్మయ్య, యాదగిరి పాల్గొన్నారు.

చెరువుల పునరుద్ధరణకు సహకరించాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చెరువును పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి: చెరువుల పునరుద్దరణకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో నాలుగేళ్ల తర్వాత నీటితో నిండిన చెరువును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.17 లక్షల వ్యయంతో చెరువుల మరమ్మతు పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. చిట్యాల అయిలమ్మ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లావుడ్య మంజుల భాస్కర్, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ మైసిరెడ్డి, మల్లారెడ్డి, రాఘవరావు, వీరమనేని యాకాంతరావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పనకు గోదాంలు దోహదం

దేవరుప్పుల: సాగు చేసిన పంటల ఉత్పత్తులను నిల్వ చేసుకొని గిట్టుబాటు ధరను రైతులు పొందేందుకు ప్రత్యేక గోదాంల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో వేర్ హౌస్ కార్పొరేషన్ ఎండీ కొర్ర లక్ష్మిని కలిసి మండలంలో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆధునిక గోదాం అవసరం ఉన్నదని వివరించారు. సానుకూలంగా స్పందించి చర్యలకు హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

కొనసాగుతున్న రైతుల యూరియా కష్టాలు



ఆగ్రోస్ సెంటర్ వద్ద రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధిలో రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. కేవలం ఒక్క యూరియా బస్తా కోసం రైతులు గంటల తరబడి లైన్లలో బారులు తీరి నిలబడి అష్టకష్టాలు పడుతున్నారు. ఘన్‌పూర్ తిరుమల ఫర్టిలైజర్స్‌కు, శివునిపల్లి ఆగ్రోస్ సెంటర్‌కు మంగళవారం యూరియా స్టాక్ వచ్చింది. యూరియా స్టాక్ వచ్చిన సమాచారంతో వివిధ గ్రామాల నుంచి రైతులు ఉదయం వరకే పెద్ద సంఖ్యలో ఆయా సెంటర్లకు చేరుకుని క్యూలలో నిల్చున్నారు. మండుటెండలో సైతం రైతులు అధిక సంఖ్యలో రాగా పోలీసు బందోబస్తు మధ్య రైతులకు యూరియా బస్తాల పంపిణీ చేపట్టారు.

ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

సాక్షి నెట్‌వర్క్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుంటూ ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా, పలు పాఠశాలల్లో వివిధ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతు ప్రదానం చేశారు.



స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న తదితరులు



నర్మెట: బొమ్మకూర్ పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ ఐలయ్య



నివాళులర్పిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్



జనగామ: ఏఎంసీలో నివాళుర్పిస్తున్న చైర్మన్ శివరాజ్ యాదవ్ తదితరులు



తరిగొప్పులలో..



రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో..



జనగామ: సెయింట్‌పాల్స్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం మరియజోసెఫ్



జఫర్‌గఢ్: జూనియర్ కళాశాలలో..



లింగాలఘణపురం: ఎంపీడీఓ కార్యాలయంలో..



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న పోతన సాహితీ కళావేదిక అధ్యక్షుడు బుజేందర్, సభ్యులు



దేవరుప్పుల: ప్రశాంతి హైస్కూల్‌లో..



కొడకండ్ల: కస్తూర్బా విద్యాలయలో..

ఉపాధ్యాయులకు సన్మానం



పాలకుర్తిటౌన్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..



జనగామ: సన్మానం పొందిన టీచర్లతో సెక్రటరీ ఉపేందర్‌రెడ్డి, విద్యార్థులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో జరిగిన యూనిట్ టెస్ట్ పరీక్షల్లో, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చారగండ్ల ప్రసాద్, కోశాధికారి సంతోష్, జోన్ చైర్మన్ శీలా చంద్రశేఖర్, చార్టర్ ప్రెసిడెంట్ ఎర్రబెల్లి రాఘవరావు, పల్లెపాటి జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో..

జనగామ: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల సెక్రటరీ చిర్ర ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరనం టీచర్లను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు.

బాలిక ఆత్మహత్య



స్మరణి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మీదికొండ గ్రామానికి చెందిన కత్తి స్మరణి(14) ఉరివేసుకుని మంగళవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీదికొండకు చెందిన కత్తి చిరంజీవి, మమత దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె తొర్రూర్‌లో పట్టణంలోని ఓ ఫౌండేషన్ స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. గత నెలలో రాఖీ పౌర్ణమి సందర్భంగా ఇంటికి వచ్చి ఇక్కడే ఉంది. పండుగకు ఇంటికి వచ్చిన బాలిక అనారోగ్యానికి గురైంది. అప్పటినుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. కాగా, మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో రేకుల ఇంటిలోని పైప్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలంబాటతో విద్యుత్ సమస్యలకు చెక్



రైతులతో ఏఈ

చిల్పూరు: పొలంబాటతో విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టవచ్చని రాజవరం ట్రాన్స్‌కో ఏఈ గోలి లక్ష్మీనారాయణ అన్నారు. రాజవరం ట్రాన్స్‌కో సెక్షన్ పరిధిలోని చిల్పూరు మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఎన్పీడీసీఎల్ ఏఈ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నచిన్న సమస్యలను ఆపరేషన్ డీఈ రాంబాబు ఆదేశాల మేరకు అక్కడికక్కడే పరిష్కరించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ నీలం ఐలేస్, చంద్రశేఖర్, రామూర్తి, లైన్‌మెన్లు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ వెంకయ్య, వీరన్న, కృష్ణ, కుర్ర వసంత, హరిశంకర్ భక్తులు పాల్గొన్నారు.

చీకటి ఒప్పందంతోనే ‘యూరియా’ అడ్డగింత

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కిరణ్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్ గౌడ్

జనగామ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక చీకటి ఒప్పందంతో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు యూరియా సరఫరా అడ్డుకుంటున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఎర్రగొల్లపహడ్ గ్రామంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో రూ. 4లక్షల విలువల గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కలను ఆయన బాధితులకు అందజేసి మాట్లాడారు. చిర్ర బైరగోని చంద్రం, నూకల బాల్‌రెడ్డి, కొత్త కరుణాకర్‌రెడ్డి, చిర్ర సత్యనారాయణరెడ్డి, కొన్నె మహేందర్‌రెడ్డి, చిర్ర హనుమంతరెడ్డి, మెరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం

జనగామ రూరల్: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అపర్ణ, జనరల్ సెక్రెటరీ శ్రీలత రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్ర సెక్రటరీ కళ్యాణి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మున్ని, ధనలక్ష్మి , భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిడిగొండలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

రఘునాథపల్లి: నిడిగొండ ఎస్సీ కాలనీలో విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల సమస్య తీరింది. మంగళవారం గ్రామంలో విద్యుత్ అధికారులు 100 రూవీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విద్యుత్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మకుంటలో కోతుల వీరంగం

జనగామ: పట్టణం బతుకమ్మకుంటలో సుందరీకరణ పనులపై కోతులు వీరంగం సృష్టించాయి. కుంట పరిసర ప్రాంతాల్లో వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలపై కోతులు దాడి చేయడంతో స్వల్పంగా నష్టం జరిగింది. ఆహ్లాదం కోసం వచ్చిన జనాలు పరుగులు పెట్టారు.


రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. మంగళవారం ఆలింపూర్ గ్రామంలో ప్రభుత్వ నిధులకు సంబంధించిన ఖర్చులు, జమపై యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీపీ రేవతి, కారోబార్ తేలుకంటి మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ పాకాల రాజేశ్వర్, జీపీ సిబ్బంది ఉన్నారు.


‘ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్‌ఎస్’

కొడకండ్ల: దేశంలో అత్యున్నత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఐదుగురు రాజ్యసభ సభ్యులున్నప్పటికీ ఓటు వేయకుండా దూరంగా ఉండటం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మసురం రవీందర్, మార్కెట్ డైరెక్టర్ దేశగాని నాగరాజులు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు.

ఎన్నిక



దేవేందర్



వెంకటేశం

పాలకుర్తి: మండల గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం నూతన కమిటీని ఎంఈఓ పోతుగంటి నర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్.దేవేందర్, కార్యదర్శిగా కందికట్ల వెంకటేశంలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా రవి కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పి. శోభారాణి, శైలజ, రమేష్, అంజయ్య, నరేందర్, రమేశ్ పాల్గొన్నారు.

యూరియా కోసం దిగులు చెందొద్దు

బచ్చన్నపేట: అన్నదాతలు యూరియా కోసం దిగులు చెందవద్దని, మండలంలోని అన్ని క్లస్టర్ల వారీగా యూరియాను పంపిణీ చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ సొసైటీలో, ఎరువుల దుకాణాల్లోని యూరియా బస్తాల నిల్వలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నార సీఈఓ కాశ బాలస్వామి, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పాలకుర్తి: మండలంలోని చెన్నూరు గ్రామానికి దేవరుప్పుల నుంచి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు చెప్పారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పెట్ల బహూకరణ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్యా వనరుల కేంద్రమైన భవితసెంటర్‌కు స్థానిక వాసవీవనిత ప్లాటినం క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కార్పెట్లను బహూకరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎంఈఓ కొమురయ్య హాజరై మాట్లాడారు. భవిత సెంటర్‌కు కార్పెట్లను అందించడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం కె.రమేష్, క్లబ్ అధ్యక్షురాలు జి.కళావతి, తాటిపెల్లి లావణ్య పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

తరిగొప్పుల: లంబాడీలను గిరిజన రిజర్వేషన్ (ఎస్టీ)జాబితా నుంచి తొలగించాలన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాబురావుపై రాజ్య ద్రోహం కేసు నమోదు చేయాలని గిరిజన లంబాడీ జేఏసీ జిల్లా కన్వీనర్ బానోత్ రామకోటి నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గుగులోతు శ్రీదేవికి మెమోరాండం అందజేశారు. సుప్రీం కోర్టులో వేసిన పిటీషన్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరారు.

చేపపిల్లల లోడ్ వాహనం దగ్ధం

- ఆగిఉన్న లారీని ఢీకొనడంతో ఘటన
- పలువురికి గాయాలు



దగ్ధమవుతున్న చేపపిల్లల లోడ్ వాహనం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని చేపపిల్లల లోడ్ వాహనం ఢీకొని పూర్తిగా దగ్ధమైంది ఈ సంఘటన బచ్చన్నపేట–చేర్యాల రహదారిపై వీఎస్ఆర్ నగర్ గ్రామంలోని టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగనూరు గ్రామానికి చెందిన బొమ్మడలేని శ్రీనివాస్ తన బావకు చెందిన వాహనంలో రాజమండ్రి నుంచి చేపపిల్లలను తీసుకొచ్చేందుకు కిరాయికి వెళ్లాడు. వాహనంలో చేపపిల్లలను సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం గురువన్నపేట చెరువులో పోయడానికి తీసుకొస్తూ ఉదయం మండలంలోని ఆలింపూర్ దాటిన తర్వాత వీఎస్ఆర్ నగర్ టోల్‌గేట్ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చేపపిల్లల లోడ్ వాహనంలో ఉన్న ఆక్సీజన్ సిలిండర్లు ప్రమాదవశాత్తు పేలి భారీగా మంటలు ఎగిసి పడ్డాయి. మంటల్లో చేపపిల్లల డ్రమ్ములు, వాహనం పూర్తిగా కాలిపోగా డ్రైవర్ శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు డ్రైవర్లు తప్పట్ల శ్రీను, కొత్తవారి శ్రీనులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని స్థానికులు గమనించి డ్రైవర్లను వాహనంలో నుంచి బయటకు తీసి ఫైరింజన్, 108 వాహనాలకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి జనగామ ఫైర్‌సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రూ. 9.50 లక్షల విలువైన వాహనం, చేపపిల్లలు రూ. 1.50 లక్షలు, మొత్తం రూ. 11 లక్షల నష్టపోయామని బాధితులు తెలిపారు. ఘటనా స్థలం వద్దకు ఎస్సై చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.